క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం

ఖమ్మం మామిళ్లగూడెం: మహాత్మజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా 11వ తేదీన జరిగే వేడుకలకు హాజరుకావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను పూలే జయంతోత్సవ కమిటీ బాధ్యులు కోరారు. ఈమేరకు శనివారం ఆయనకు ఆహ్వానపత్రిక అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి, కమిటీ సభ్యులు షేక్ షకీనా, సిద్దాసాహెబ్, బొమ్మా రాజేశ్వరావు, జక్కుల లక్ష్మయ్య, కత్తి నెహ్రూ, మేకల సుగుణారావు, పెరుగు వెంకటరమణ,రామ్మూర్తి పాల్గొన్నారు.

విభజన హామీలను అమలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్యలో కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసేలా అడుగులు వేస్తోందని విమర్శించారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు యువరాజ్, చందూలాల్, మధు, వినోద్, సతీష్, శశి, వెంకటేష్, గోపి, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పన్నెండు రకాల సరుకులు అందించాలి

నేలకొండపల్లి: రేషన్ దుకాణాల్లో పన్నెండు రకాల నిత్యావసర సరుకులు అందించాలని పీవైఎల్ మండల కార్యదర్శి గాదె నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చౌక దుకాణాలను రద్దు చేసే కుట్ర పన్నుతుందన్నారు. ప్రభుత్వ రేషన్ దుకాణాలను కాపాడుకునేందుకు పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు బి.స్టీవెన్, బి.శ్రీనివాసరావు, జాషువా పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లో ఆదివారం జరిగే వామపక్షాల సంయుక్త సభను జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్ష ఐక్యతను మరింత పటిష్ట పరిచేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఐ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, కార్యదర్శులు కె.నారాయణ, బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు పాల్గొంటారన్నారు.

ఎస్సెస్సీ స్పాట్ పారితోషికం చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: గతేడాది పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్(మూల్యాంకన విధులు) నిర్వహించిన ఇంగ్లిష్, గణితం ఉపాధ్యాయులకు నేటి వరకు పారితోషికం చెల్లించలేదని, తక్షణమే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో కోరారు.

స్థల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రజల అవసరాలకు తగిన విధంగా మంచినీటిని సరఫరా చేసేందుకు అనుగుణంగా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలు చేపడుతున్నట్లు కేఎంసీ ఎస్ఈ రంజిత్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 41వ డివిజన్‌లో గల ఫిల్టర్ బెడ్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వాటర్ ట్యాంక్‌ను నిర్మించేందుకు కార్పొరేటర్, ఎస్ఈలు స్థల పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈ నవీన్‌కుమార్, ఏఈ హుస్సేన్, సాంబశివరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

కూసుమంచి: కూసుమంచి ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులురావిచెట్టుతండాకు చెందిన తేజావత్ వెంకట్రాం (ఈఈ, నీటిపారుదలశాఖ), తేజావత్ భద్రూ (రైల్వే డివిజనల్ మేనేజర్), తేజ (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, లండన్) కుటుంబ సమేతంగా శనివారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతులుగా ఎదగాలన్నారు. అనంతరం పాఠశాలలో 10 కంప్యూటర్‌లతో ల్యాబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల హెచ్ఎం రేలా విక్రంరెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	మీటర్
ఆదిత్య	రావణాసుర
శ్రీనివాస	రావణాసుర
సుందర్	ది పోప్స్ ఎక్సోరిస్ట్ (తెలుగు)

- ఖమ్మం గాంధీచౌక్

టిజోలా జోష్..!



ఫుడ్ డెలివరీకి సిద్ధంగా ఉన్న బాయ్స్

సండే స్పెషల్

ఫుడ్ డెలివరీతో రాణిస్తున్న మారుమూల యువకుడు

- నాడు ఉపాధి కోసం యువకుడి కష్టాలు
- నేడు 200 మందికి ఉపాధి కల్పన
- అవార్డులతో దూసుకెళ్తున్న వైనం

అదో మారుమూల గ్రామం.. కనీసం ఎర్రబస్సు కూడా రాదు. కానీ ఓ యువకుడు ఏదైనా సాధించాలనే కసితో ముందుకు సాగాడు.. ఉపాధి కోసం ఎక్కడెక్కడో తిరిగాడు. సమాజంలో నిలబడేందుకు పరుగులు తీశాడు. ఎన్నో కష్టాలను అధిగమించాడు.. ఫలితాలు సాధించాడు. ఒకప్పుడు పని కోసం తిరిగిన యువకుడు.. నేడు 200 మందికి ఉపాధి కల్పిస్తూ.. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

నేలకొండపల్లి: మండలంలోని మారుమూల గ్రామమైన సుర్దేపల్లి గ్రామానికి చెందిన బలుసు సురేష్ అనే యువకుడు ఉపాధి కోసం ఎక్కడెక్కడో తిరిగాడు. ఎందరినో సహాయం అడిగినా.. ఎవరూ సహకరించలేదు. మొక్కవోని దీక్షతో వెనకడుగు వేయకుండా ఒక ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిలో చేరాడు. కొంత కాలం తర్వాత ఒకరు తనకు పని కల్పించేది ఏంటీ అని తనకున్న అనుభవంతో అతి తక్కువ కాలంలోనే టిజోలా ఫుడ్ డెలివరీని ప్రారంభించాడు. అంతే వెనక్కి తిరిగి చూడకుండా తెలుగు రాష్ట్రాల్లో చిన్న పట్టణాల నుంచి మహా నగరాల వరకు ఫుడ్ డెలివరీ చేస్తూ విజయవంతంగా ముందుకు సాగుతున్నాడు. రెస్టారెంట్లు, ఇతర హోటళ్లతో టైఅప్ అయి ఆన్‌లైన్‌లో బుకింగ్ అయిన ఫుడ్‌ను డెలివరీ చేస్తుంటారు.

వ్యాపారంలో తాను అభివృద్ధి చెందటమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఆరు నెలల కాలంలోనే దాదాపు 12 వేల యాప్ డౌన్‌లోడ్ చేయించి, 20 వేల ఫుడ్ డెలివరీలతో రికార్డు సృష్టించాడు.



కరోనా కాలంలో ఆక్సిజన్ సరఫరా చేస్తున్న దృశ్యం(ఫైల్)

కరోనా కాలంలో సేవా కార్యక్రమాలు..

తాను జీవితంలో అభివృద్ధి చెందకముందే సేవా గుణం కలిగిన వ్యక్తి. కరోనా సమయంలో కరోనా బారిన పడి ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి ఉచితంగా ఆహారం, మందులు ఇంటింటా తిరిగి అందించాడు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఆక్సిజన్‌ను డోర్ డెలివరీ చేయించేవాడు. దీంతో టిజోలాకు కరోనా వారియర్ అవార్డుతో అభినందించారు.

యువతకు అవకాశాలు..

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. పలు పట్టణాల్లో ట్యాక్సీని ప్రారంభించి బుకింగ్ సేవలు అందించారు. మహిళలకు ప్రయాణ సౌకర్యంతో పాటు ఉపాధి కల్పించాలనేది ముఖ్య ఉద్దేశం. తనతో పాటు 200 మందికి ఉపాధి కల్పిస్తున్నందున్న ఇండియా మోస్ట్ ప్రోమిసింగ్ అండ్ ఫుడ్ కంపెనీస్, డైనమిక్ స్టార్టప్ యాప్ ఇండియా 2021, బెస్ట్ ఫ్రాంచైజ్ స్టార్టప్ ఆఫ్ ది ఇయర్, బెస్ట్ ఎమర్జింగ్ ఫుడ్ డెలివరీ ఆఫ్ తెలంగాణ, ఏపీ అవార్డులను అందుకున్నారు.

చేసే పనిని ఇష్టపడాలి..



చేసే పనిని ఇష్టపడి పనిచేస్తే ఫలితం తప్పకుండా వస్తుంది. ఒకప్పుడు సంస్థ ప్రారంభించినప్పుడు ఎవరైతే నవ్వుకున్నారే ప్రస్తుతం వారికే పని కల్పిస్తున్నా. నిరుద్యోగులకు ఉపాధి కల్పించటంతో పాటు ఆకలితో ఉన్న వారికి సకాలంలో అన్నం అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని నగరాల్లో స్థాపించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– బలుసు సురేష్, టిజోలా కంపెనీ అధినేత



అవార్డు అందుకుంటున్న సురేష్(ఫైల్)

ఉపాధి హామీని రద్దు చేస్తే ఊరుకోం..



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం రద్దు చేస్తే ఊరుకోమని అఖిలభారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆర్.శివలింగం అధ్యక్షతన రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఏఐపీకేఎంఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని చూస్తోందన్నారు. నిరుపేదలకు ఉపాధి హామీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26 నుంచి మండల కేంద్రాల్లో ఎంపీడీఓలకు, ఈనెల 29న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, ఆవుల మంగతాయి, లాజరు, ఎస్‌కె.జానీ, వీర్ల వెంకటఅప్పారావు, కూరాకుల నర్సయ్య, చల్లా రాజు, కంకణాల అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మొదటి వార్షికోత్సవాన్ని లకారం ట్యాంక్ బండ్ వద్ద ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ నీరజ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఫ్రాంచైజి హెడ్ సుభాష్, ఎయిమ్స్ డైరెక్టర్ ఆకాష్, చైర్‌పర్సన్ శ్రీనివాసరావు, డైరెక్టర్ రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్మార్ట్ కిడ్జ్' విద్యార్థుల సత్తా..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యార్థులు ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ఫలితాల్లో సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటర్నేషనల్ ఎస్ఓఎఫ్ సంస్థ గోల్డ్ మెడల్స్‌ను పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ మెడల్స్, నలుగురికి జోనల్ లెవెల్ టాపర్ మెడల్స్, 78 మందికి జోనల్ లెవెల్ డిస్టింక్షన్ మెడల్స్, 50 మందికి స్కూల్ లెవెల్ ఎక్సలెన్సీ గోల్డ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ..

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షలో తమ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. ఈ సందర్భంగా మామిళ్లగూడెంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్, ఎన్టీఆర్ సర్కిల్‌లోని శ్రీచైతన్య టెక్నో స్కూల్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీజీఎం చేతన్, ఆర్ఐ జయప్రకాష్, ప్రేమరీ జోనల్ కో ఆర్డినేటర్ పార్వతి, డీన్ అఖిల్ రాజ్, ప్రిన్సిపాల్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ధనార్జనే ధ్యేయంగా పాఠశాలల నిర్వహణ

ఖమ్మమయూరిసెంటర్: ధనార్జనే ధ్యేయంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు పనిచేస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. శనివారం నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల వార్షికోత్సవాల పేరుతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు కరుణ్, సాయి, శ్రీకాంత్, గణేష్, తరుణ్, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ కార్యకర్తపై దౌర్జన్యం

నేలకొండపల్లి: మండల కేంద్రానికి ఆర్‌టీఐ కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ శనివారం తనపై బీఆర్ఎస్ నాయకుడు, నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి దౌర్జన్యం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వ్యవసాయ మార్కెట్‌లో నిమిత్తం తాను వెళ్లగా, అక్కడ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సైదారెడ్డి ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తూ దౌర్జన్యం చేయడమే కాక సెల్‌ఫోన్ లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దాడి ఘటనపై పీఎస్ ఎదుట ధర్నా

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీ గోపాలపురానికి చెందిన బోడా శ్రావణ్‌కుమార్‌పై శుక్రవారం అర్ధరాత్రి తనపై దాడి జరిగిందని పేర్కొన్నారు. కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి తన పుట్టిన రోజు వేడుకలు జరగగా, అక్కడే బలగం సినిమా ప్రదర్శన ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. అనంతరం తాను గోపాలపురంలోని ఇంటికి వెళ్తుండగా దారికాసిన విజయ్, మనోజ్, వినయ్ సహా పలువురు అడ్డుకుని రాళ్లు, కర్రలతో కారును ధ్వంసం చేశారని తెలిపారు. ఈవిషయమై ఎస్ఐకి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఖమ్మం అర్బన్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా, స్టేషన్ ఎదుట శ్రావణ్ సహా పలువురు ఆందోళన చేశారు. దీంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాక, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించినందుకు గాను శ్రావణ్‌తో మద్దతుగా వచ్చిన 21 మందిపై కానిస్టేబుల్ బి.నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మెహర్‌బాబా షష్టిపూర్తి ఉత్సవాలు



మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు రామచంద్రయ్య

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని స్వర్ణ భారతి ఫంక్షన్ హాల్‌లో శనివారం అవతార్ మెహర్‌బాబా షష్టిపూర్తి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మెహర్‌బాబా ఖమ్మం ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.రామచంద్రయ్య మాట్లాడుతూ.. మెహర్‌బాబా సత్య సందేశం మానవాళి మధ్య ఐక్యత, స్నేహబావం, ప్రేమానురాగాలు కలిగిస్తుందన్నారు. నాగార్జున యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బి.కేశవరావు, జేఎస్ఎస్ సుబ్బరామయ్య, కాష్టానంద్, బి.కృష్ణయ్య, నారాయణ, సుబ్రమణ్యం, ఎం.కృష్ణ నారాయణ, ఖమ్మం పబ్లిక్ స్కూల్ చైర్మన్ దలువాయి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం

ఖమ్మంగాంధీచౌక్: త్రిదండి చిన్న జీయర్ స్వామికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రదానం చేసిన సందర్భంగా ఖమ్మం వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వికాస తరంగిణి ప్రతినిధులు శాంతి, ఉషారాణి, దుర్గారావు, వెంకటకృష్ణ, శ్రీదేవి, సునీత, సక్కుబాయి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష



మాట్లాడుతున్న తుంపాల కృష్ణమోహన్

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పిలుపు మేరకు శనివారం ఖమ్మం ధర్నాచౌక్‌లో పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణ మోహన్ మాట్లాడుతూ.. నిరుద్యోగులు, విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై తమ పార్టీ పోరాడుతుందని, వరుస కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జల్లెపల్లి సైదులు టీకే మోహన్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్, గణపవరపు సురేష్, రావుల గంగరాజు, వెంకట లాలయ్య, అరుణ, లావణ్య, ఆదూరి రాజవర్ధన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, ఎస్‌కె.పాషా, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, సురేష్, గడ్డం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెంలో రోడ్డులో మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీబీచైర్మన్ కురాకుల నాగభూషణం శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కురాకుల వలరాజు, నీరజ తదితరులు పాల్గొన్నారు.

'రన్ ఫర్ జీసస్' ర్యాలీ..

ఖమ్మంగాంధీచౌక్: ఈస్టర్ పండుగను పురస్కరించుకొని శనివారం ఖమ్మం నగరంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రారంభమైన ర్యాలీని నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, పల్లా రాజశేఖర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవుని సేవకులు సీహెచ్.రమేష్, మంద తిమోతి, సంజీవరావు, ఎంఎస్ చిన్ని, డేవిడ్, పగిడిపల్లి రవికిరణ్, సామేలు, ఇమ్మాన్యుయేలు, జగన్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు గ్రామం నుంచి శనివారం మండల కేంద్రం వరకు నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బీ.వీ.రత్నం, యాకోబ్ రాజు, డేవిడ్ రాజు, షాలేమ్ రాజు, ఏలియాజర్, ఏజీ రత్నం, దాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న గుడవర్తి నాగేశ్వరరావు

నేలకొండపల్లి: గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో పట్టణ కమిటి కార్యదర్శి మందడపు మురళీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలు చేతికొచ్చిన నేపథ్యంలో ధాన్యం దళారుల పాలు కాకముందేకొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. నెలాఖరు వరకు సాగు నీటిని సరఫరా చేయాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ నాయకులు తెల్లమేకల శేషుబాబు, కేవీ.చారీ, మన్నె లింగరావు, సామాల మల్లిఖార్జున్ రావు, కూరపాటి అప్పారావు, కూచిపూడి శ్రీదేవి, కొత్తా రమేష్, రావెళ్ల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరక్షలో అరుదైన శస్త్రచికిత్స



చికిత్స వివరాలు వెల్లడిస్తున్న ఆస్పత్రి వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని శ్రీరక్ష ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ఓ యువకుడి ప్రాణాలను కాపాడారు. ఆస్పత్రి యజమాన్యం డాక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం తనగంపాడుకు చెందిన సీహెచ్.బాలరాజు విద్యుత్‌షాక్‌కు గురై 15అడుగుల ఎత్తు నుంచి కిందపడగా కుడి కిడ్నీ పూర్తిగా దెబ్బతిని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో ఆయనను శ్రీరక్ష ఆస్పత్రికి తీసుకురాగా, వైద్యులు కాశీవిశ్వనాథ్, ఏడుకొండలు, వెంకటేష్, సతీష్, మానస చికిత్స చేయడంతో బాలరాజును ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. కాగా, బాలరాజును సీపీఎం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, నున్నా నాగేశ్వరరావు పరామర్శించారు.

పెన్షనర్ల దీక్షకు మద్దతు

ఖమ్మం మామిళ్లగూడెం: దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై ఈనెల 10న జిల్లా నూతన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల నిరసన దీక్షకు సీనియర్ సిటిజెన్స్ అసోసియేట్ అధ్యక్షుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్, రిటైర్డ్ తహసీల్దార్ ఆర్.రవీందర్‌రావు మద్దతు తెలిపారు. శనివారం సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాదినేని జనార్దన్‌రావు, కోశాధికారి గోవర్దన్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రిటైర్డు తహసీల్దార్ గుడ్ల వీరభద్రం, ఉప్పలయ్య, కె.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

నేలకొండపల్లి: పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి మండలంలో శనివారం విస్తృతంగా పర్యటించారు. తౌలుత మార్కెట్ యార్డ్‌లో ఆదివారం జరగనున్న ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నేలకొండపల్లి ఎస్సీ, బీసీ కాలనీలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయమందించారు. రాజేశ్వరపురం మసీద్‌లో నూతనంగా నిర్మించిన హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు శాఖమూరి సతీష్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మయ్య, వెన్నబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ ముల్కూరి శ్యాంసుందర్‌రెడ్డితో పాటు విగ్రహ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



కూసుమంచి: విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సింగరేణి మహాధర్నాకు పయనం..

ఖమ్మంరూరల్: సింగరేణి బొగ్గగనులు వేలం, ప్రైవేటీకరణకు నిరసనగా కొత్తగూడెంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మహాధర్నాకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకలతో కలిసి ర్యాలీగా తరలి వెళ్లారు. నాయుడుపేట చౌరస్తాలో బీఆర్ఎస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెల్లం వేణు, శేఖర్, బి.శ్రీనివాస్, జి.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మోదీకి రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదు..

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రధాని మోదీ నెరవేర్చలేదని, విభజన హామీల ఊసేత్తని మోదీ రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా నేతలు ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ పర్యటనను నిరసిస్తూ ఆయా పార్టీలు శనివారం వేర్వేరుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి.

దేశ సంపదను కార్పొరేట్‌కు కట్టబెడుతున్నారు..

ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. మోదీ పర్యటనకు నిరసనగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్ నుంచి సరిత క్లినిక్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, దొంగల తిరుపతిరావు, ఆర్.ప్రకాష్‌లతో పాటు బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వ్యతిరేకి మోదీ..

మోదీ తెలంగాణ వ్యతిరేకి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. మోదీ పర్యటనను నిరసిస్తూ స్థానిక జెడ్పీ సెంటర్‌లో ఆందోళన చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కె.జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్‌లతో పాటు బి.జి.క్లెమెంట్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

నరేంద్ర మోదీ గో బ్యాక్..

విభజన హామీలు నెరవేర్చని ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో గట్టయ్యసెంటర్‌లో కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు రామనర్సయ్య విజ్ఞానకేంద్రం నుంచి ఆర్టీవో ఆఫీస్ మీదుగా ప్రదర్శన గట్టయ్య సెంటర్‌కు చేరుకోగా.. అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపంథ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మోదీకి తెలంగాణలో పర్యటించే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఆజాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.అర్జున్‌రావు, డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్, నగర కార్యదర్శి ఝాన్సీ మంగతాయ్, కంకణాల శ్రీను, రాకేష్, కొమరయ్య, బందెల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.